

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, పక్కన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు

# హుజూరాబాద్ గడ్డ.. కేసీఆర్ అడ్డా

- ఇక్కడ ఎగిరేది గులాబీ జెండానే
- బీఆర్ఎస్ సెంచరీ ఖాయం
- ఈటల రాజీనామా తర్వాత ₹300 కోట్లతో అభివృద్ధి చేశాం
- నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం
- హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 20: ఎన్నికల్లో హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానేనని, ఈ గడ్డ.. కేసీఆర్ అడ్డా అని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. అధినేత కేసీఆర్ తెచ్చిన మ్యానిఫెస్టోను చూసి ప్రతిపక్షాలకు దిమ్మ తిరుగుతుందని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సెంచరీ చేస్తుందని, బీజేపీ డక్ ఔట్ అవుతుందని, అలాగే కాంగ్రెస్ రన్ ఔట్ అవుతుందని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమానికి తెలంగాణ రాష్ట్రం కేరాఫ్‌గా నిలిచిందని పేర్కొన్నారు. హుజూరాబాద్ సిటీ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి పేదల బతుకుల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. ఈటల రాజీనామా చేసిన తర్వాత హుజూరాబాద్‌లో ₹300 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, సైదాపూర్, సూపర్‌బజార్ రోడ్లను అద్భుతంగా నిర్మించుకున్నామన్నారు. 106 పంచాయతీల్లో మహిళా, కుల సంఘాల భవనాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ మహనీయుడిపై గౌరవాన్ని చాటారని చెప్పారు. దళితబంధు పథకం లబ్ధిదారులు ఇప్పుడు నెలకు ₹30 వేల నుంచి ₹2 లక్షలు సంపాదించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు ₹37 వేల కోట్ల రుణమాఫీ చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కీర్తించారు. కాళేశ్వరం నిర్మించి ప్రతి ఎకరాకు నీరందిస్తున్నారన్నారు. హుజూరాబాద్‌లో ₹2 వేల కోట్ల మేర సబ్సిడీ కరెంట్ ఇస్తున్నామన్నారు. ఈటల మళ్లీ గెలిచిన తర్వాత చేసిన పనులేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన్ను ఇక్కడి ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని, ఇటీవల జమ్మికుంట బీజేపీ సభలో మాట్లాడుతుండగానే ప్రజలు వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శమన్నారు.

## గిట్టని వారే దుష్ప్రచారం

నేను కోపంతో మాట్లాడుతానని, దురుసుగా ప్రవరిస్తున్నానని కొందరు గిట్టని వారు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆక్షేపించారు. తాను అలాంటి వ్యక్తిని కాదని, ఏదైనా ముక్కుసూటిగా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతానని స్పష్టం చేశారు. తాను కల్మషంలేని వ్యక్తినని, నటించడం తనకు చేతకాదని చెప్పుకొచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న తన వ్యక్తిత్వంపై ప్రతిపక్షాల గోబెల్ ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు. హుజూరాబాద్ అభివృద్ధికి తాను ప్రత్యేక మ్యానిఫెస్టో రూపొందించానని తెలిపారు. గెలిచిన తర్వాత ఆచరణలోకి తెచ్చి హుజూరాబాద్‌ను సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ప్రజలు పనిచేసే వారిని ఆదరించాలని కోరారు. అలాగే హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు, అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, సంగెం ఐలయ్య, కౌన్సిలర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్, మారేపల్లి సుశీల, ముక్క రమేశ్, ఉమామహేశ్వర్, రాష్ట్ర నేత వర్ధినేని రవీందర్‌రావు, నేతలు కొండ్ర నరేశ్, ఇమ్రాన్, కృష్ణ, పంజాల కుమారస్వామి, హన్మంత్‌గౌడ్, శ్రీనివాస్, గోపాల్‌రావు, భిక్షపతి, మైఖేల్, తిరుపతి, మధూకర్, వెంకటేశ్, కిషన్‌రెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాంనగర్, అక్టోబర్ 20 : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు తెలిపారు. గురువారం కరీంనగర్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్పెన్సార్ వద్ద రెండు వేర్వేరు బైక్‌లపై వెళ్లే ఇద్దరు వ్యక్తులకు ప్రమాదం జరిగిందన్నారు. వారి ఇద్దరికీ ఎటువంటి పరిచయం గానీ, పాత కక్షలు గానీ లేవన్నారు. అది అనుకోని తప్పిదం వల్ల జరిగిన ప్రమాదం మాత్రమేనన్నారు. ఈ ఘటనలో అక్కడే ఉన్న కొంతమంది చట్టాన్ని అతిక్రమించి గుమిగూడి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఇష్టారీతిన దాడి చేశారని చెప్పారు. అంతేకాకుండా అతడి బైక్‌ను తగలబెట్టేందుకు యత్నించారన్నారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, బ్లూ కోల్ట్ సిబ్బంది చేరుకొని నిలువరించే ప్రయత్నం చేశారన్నారు. అయినా వారి మాట వినకుండా దుర్భాషలాడుతూ, విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఘటనకు సంబంధించి కరీంనగర్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యులపై మూడు కేసులు నమోదు చేశామని, విచారణ ఇంకా కొనసాగుతుందని తెలిపారు.

## యాదవులు ఐక్యంగా ఉండాలి

- యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నగరపు సత్యనారాయణ యాదవ్

చొప్పదండి, అక్టోబర్ 20: యాదవులంతా ఐక్యంగా ఉండాలని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నగరపు సత్యనారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. చొప్పదండిలో శుక్రవారం మండల యాదవ మహాసభ సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేంసాని రవీందర్ యాదవ్, మండలాధ్యక్షుడు రాపల్లి ఐలయ్య యాదవ్, సాంబయ్యపల్లి ఉపసర్పంచ్ కాల్వ రమ్య-అనిల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మారం యువరాజు యాదవ్, పానుగంటి ఆగయ్య యాదవ్, వేల్పుల మల్లయ్య యాదవ్, దాడి సదయ్య, పంబాల శ్రీనివాస్ యాదవ్, సంకరి మోహన్, సతీశ్, ఆవుల రాజయ్య, రాజయ్య యాదవ్, కొమురయ్య యాదవ్, యంసాని మల్లేశ్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు ఓటేసి అండగా నిలుద్దాం

- మీ మధ్య ఉండే ఈ మట్టిబిడ్డను ఆశీర్వదించండి
- కాంగ్రెస్ మాటలు నమ్మితే గోసపడుతం
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- రామడుగు మండలంలో ఇంటింటా ప్రచారం



దేశరాజ్‌పల్లిలో ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

రామడుగు, అక్టోబర్ 20: పదేండ్లలోనే రాష్ర్టాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్‌కు ఓటేసి అండగా నిలుద్దామని చొప్పదండి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ మట్టి బిడ్డగా మీ మధ్యన ఉంటానని, తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రామడుగు మండలం వెదిర, దేశరాజ్‌పల్లి, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేండ్లలో ₹వందల కోట్ల నిధులను తెచ్చి చొప్పదండి నియోజకవర్గాన్ని మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి చివరి ముఖ్యమంత్రి తెలంగాణ వస్తే కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకుంటారని, అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందిపడే కాలమొస్తదని ఎగతాళి చేశారని గుర్తు చేశారు. ఇగ నేటి కాంగ్రెస్ అధ్యక్షుడైతే రైతులకు మూడు గంటల కరెంటు సరిపోదా..? అని రైతుల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీశాడన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అరవై ఏండ్లు పాలించిన తెలంగాణను మాత్రం అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. కానీ, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకునేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేశారని, బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి అయిందని కొనియాడారు. కర్ణాటక ఎన్నికల్లో ఐదు గ్యారంటీల పేరు తో మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించలేక చేతులెత్తేసిందన్నారు. అక్కడి రైతులకు ఐదు గంటల కరెంటు మాత్రమే ఇస్తామని, అదనంగా ఒక్క నిమిషం కూడా ఇవ్వలేమని కర్ణాటక విద్యుత్‌శాఖ మంత్రి చెబుతున్నాడన్నారు. కేవలం మోసం చేసి గద్దెనెక్కేందుకే మాయల మరాఠీలు మళ్లీ పల్లెలకు వస్తున్నారని విమర్శించారు. పండుగలప్పుడు మాత్రమే పగటి వేషగాళ్లు వస్తారని, ఐదేండ్ల తరువాత మిమ్మల్ని మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు వస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మితే గోస పడుతామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, సర్పంచులు నాగుల సంగీతారాజశేఖర్‌గౌడ్, ఉమ్మెంతల అభిషేక్‌రెడ్డి, జాడి లక్ష్మీరాజమల్లు, ఎంపీటీసీలు తౌరికొండ అనిల్‌కుమార్, వంచ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్మన్ మామిడి తిరుపతి, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ జూపాక కరుణాకర్, జిల్లా సభ్యుడు వీర్ల సంజీవరావు, నాయకులు రవీందర్‌రావు, మురళి, సత్యనారాయణరెడ్డి, ఎల్కపెల్లి లచ్చయ్య, గజ్జెల ఆనందరావు, మ్యాన మురళీధర్, బత్తిని తిరుపతిగౌడ్, కొడిమ్యాల రాజేశం పాల్గొన్నారు.



దేశరాజ్‌పల్లిలో బీఆర్ఎస్ ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు



కొక్కెరకుంటలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న సుంకె రవిశంకర్

# అలరించిన చల్మెడ వైద్య కళాశాల వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 20: బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల 20వ వార్షికోత్సవం శుక్రవారం వింశతి-20 పేరిట ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ ఆశ వైద్యశాల సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ గౌరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు, డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అసీమ్ అలీ, నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న వైద్య విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గౌరి, డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, వైద్య విద్యార్థులు